క్లుప్తంగా

ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం



దుకాణాలు తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదేశాలతో బుధవారం ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, సచివాలయ శానిటరీ సెక్రటరీల ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దుకాణాలను తనిఖీ చేశారు. దాదాపు 8 దుకాణాల్లో 3.5 కేజీల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని యజమానులకు రూ.3,900 అపరాధం విధించారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అపరాధ రుసుం విధించినా ప్లాస్టిక్ విక్రయాలు మానకపోతే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు మంత్రి పర్యటన

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ గురువారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లిలో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఉదయం 11 గంటలకు కళ్యాణదుర్గంలోని మంత్రి కార్యాలయంలో నియోజకవర్గంలోని వాల్మీకి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రంలో సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొననున్నట్లు మంత్రి కార్యాలయ వర్గాలు వివరించాయి.

జగనన్న లే అవుట్ల పరిశీలన



జగనన్న లే అవుట్ పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య

శెట్టూరు: మండల కేంద్రంలోని జగనన్న లే అవుట్లను డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులు, హౌసింగ్ సిబ్బందితో మాట్లాడారు. లబ్ధిదారులకు బిల్లులు, సిమెంట్ సకాలంలో ఇస్తున్నామన్నారు. త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఇంచార్జ్ ఎంపీడీఓ రఘురామరావు పాల్గొన్నారు.

శుభకార్యం

కూడేరు: మండల పరిధిలోని కడదరగుంటకు చెందిన వలంటీర్ హరి (బోయ నారాయణ స్వామి కుమారుడు) వివాహం మేడాపురంలో బుధవారం జరిగింది. అలాగే పి.నాగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఓబుళపతి నాయుడు కుమార్తె వివాహం ధర్మవరంలో జరిగింది. ఈ వివాహ వేడుకలకు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, వైస్ ఎంపీపీ దేవ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు పుల్లన్న, ధనుంజయ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సులేమాన్ (ఫైల్)

ఉరవకొండ: స్థానిక జైనబీ దర్గా మసీదు వద్ద నివాసముంటున్న సులేమాన్ (19) అనే యువకుడు విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి అనంతపురంలోని చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఉరవకొండ పట్టణంలోని రాయంపల్లి లేఅవుట్ కాలనీలో దర్గామసీదు ఇమాంగా పని చేస్తున్న హుసేనీకి ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు మంజూరు చేసింది. ఈనెల 19న హుసేనీ కుమారుడు సులేమాన్ నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పైకప్పుపై ఉన్న ఇనుప కడ్డీలను తీసుకొస్తుండగా అటుగా ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. తీవ్రంగా గాయపడిన అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పాటిల్ రాచన్న గౌడ్ మృతి బాధాకరం



రాచన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: జేసీఎస్ మండల కన్వీనర్, వజ్రకరూరు పీఏసీఎస్ డైరెక్టర్ పాటిల్‌రాచన్న గౌడ్ మృతి బాధాకరమని వజ్రకరూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఏడీసీసీ కార్యాలయంలో పాటిల్ రాచన్న గౌడ్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వజ్రకరూరు పీఏసీఎస్ బలోపేతానికి రాచన్నగౌడ్ కృషి చేశారన్నారు. రైతులకు అండగా నిలిచారని వెల్లడించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బలరాముడు, మాజీ సర్పంచ్ వైద్యనాథరెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు పట్టాభాజాపీరా, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ రాజేంద్రప్రసాద్, సీఈఓ నూరి తదితరులు పాల్గొన్నారు.

పోకిరీలకు అడ్డాగా కళాశాల మైదానం



మైదానంలో పడి ఉన్న మద్యం బాటిళ్లు

రాయదుర్గం: పట్టణంలోని కణేకల్లు రోడ్డులో జూనియర్ కళాశాల మైదానం సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఉదయం, సాయంత్రం వాకింగ్, వ్యాయామం చేసేందుకు యువకులు, మేధావులు, ఉద్యోగులు, మహిళలు, చిన్నారులు, వృద్ధులు వస్తుంటారు. ఇక్కడే మోడల్ స్కూల్ కూడా ఉంది. దానికి ఆనుకునే విద్యార్థినుల వసతి గృహం ఏర్పాటు చేశారు. అయితే, ఈ ప్రాంతాన్ని కొందరు పోకిరీలు అపవిత్రంగా మారుస్తున్నారు. రాత్రిళ్లు బార్ ప్రాంతంగా వాడేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మలుచుకున్నారు. మద్యం సీసాలు పడేసి వెళ్లడం కొన్నాళ్లుగా సర్వసాధారణమైంది. ఈ క్రమంలో వాకింగ్‌కు వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారు. పోకిరీలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని అర్బన్ సీఐ లక్ష్మన్న దృష్టికి తీసుకెళ్లగా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పోలీసు గస్తీ పెంచుతామన్నారు. ఎంతటివారైనా అదుపులోకి తీసుకుని క్రిమినల్ చర్యలు చేపడతామన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రాయదుర్గంటౌన్:పట్టణంలోని పార్వతినగర్ ఒకటో సచివాలయం, కోటవీధి-2లోని 14వ సచివాలయాల్లో జరుగుతున్న ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి కోరారు. ఈ నెల 28 వరకూ ఆధార్ నమోదు చేస్తారన్నారు. 5–15 ఏళ్లు పైబడిన వారికి కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్, మొబైల్ నంబర్ లింక్, మార్పులు చేర్పులు, 60 ఏళ్లు పైబడిన వారికి అప్‌డేట్ చేస్తారన్నారు.

రాయదుర్గం రూరల్: మండలంలో ఈనెల 28వ తేదీ వరకు సచివాలయాల్లో జరిగే ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 26న డి.కొండాపురం, వేపరాళ్ల, మెచ్చిరి, 27న బొందనకల్లు, ఆవులదట్ల, చదం, 28న మల్లాపురం , వద్రహొన్నూరు, పల్లేపల్లిలో ఆధార్ అప్డేట్ చేయనున్నట్లు వెల్లడించారు.

గుమ్మఘట్ట మండలంలో..

గుమ్మఘట్ట: మండలంలోని సిరిగెదొడ్డి, తాళ్లకెర గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు.

శనగ పంటలో మెలకువలు పాటించాలి

కళ్యాణదుర్గం: రబీలో సాగు చేసే పప్పుశనగ పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శిరీష చెప్పారు. శనగ పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకేలో బుధవారం రైతులకు వివరించారు. ఒకే పొలంలో పంటను సాగు చేయడం వల్ల ఎండు తెగులు తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పప్పుశనగ విత్తుకునే రైతులు ముందురోజు రాత్రి కిలో విత్తనానికి 2.5 గ్రాముల కర్బండిజంతో విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం మరుసటి రోజు 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడీతో విత్తన శుద్ధి చేసి విత్తుకుంటే పంటను ఎండుతెగల నుంచి కాపాడుకోవచ్చన్నారు. పంటను విత్తిన 12–15 రోజుల లోపే 10 గ్రాముల కార్బెండిజం తో పాటు 60 శాతం మాంకోడెడ్ లీటరు నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలన్నారు. జొన్న లేదా ధాన్యపు పంటను పంటలతో కనీసం మూడేళ్లు పంట మార్పిడి చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్త తెలియజేశారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్లతో రిజర్వేషన్ సదుపాయం

కూడేరు: క్రీడల్లో బాగా రాణించి సర్టిఫికెట్స్ పొందితే స్పోర్ట్స్ కోటా కింద ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సదుపాయం ఉంటుందని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ తెలిపారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో 28 ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ–9వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. క్యాంప్‌లో కర్నూలు, నంద్యాల, అనంతపురం, పుట్టపర్తి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు శిక్షణ పొందుతున్నారు. బుధవారం క్యాడెట్లకు ఖోఖో, కబడ్డీతో పాటు ఇతర క్రీడలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఎస్‌ఎం కేకే సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా హరినాథ్



కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం పట్టణ సీఐగా హరినాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తేజమూర్తి బదిలీకావటంతో ఉరవకొండ అర్బన్ సీఐగా పని చేస్తున్న హరినాథ్‌ను ఇక్కడికి నియమించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కూడేరు: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి 200 రోజులు పని కల్పించాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. వలసలు వెళ్లకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించాలని కోరారు. దిన కూలి రూ.600లకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ షరీఫ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, వ్యకాసం జిల్లా కమిటీ సభ్యుడు పెరుగు సంగప్ప, రమణ, తాలుకా అధ్యక్షుడు మలరాయుడు, మండల నాయకులు కాశీం పీరా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'నా భూమి- నాదేశం'

కళ్యాణదుర్గం రూరల్: మానిరేవు గ్రామంలో నా భూమి - నాదేశం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, వెంకటేశులు నాయక్ మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నా భూమి - నాదేశం కార్యక్రమం చేపట్టాయన్నారు. అమృత్ కలష్ భాగంగా ర్యాలీని నిర్వహించి మట్టిని సేకరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రగతి పతం యూత్ అసోసియేషన్ ప్రతినిధి సంతోష్, నాయకులు రాజారెడ్డి, వెంకటేశులు, నల్లప్పరెడ్డి, చాంప్లా నాయక్, సర్దానినాయక్, హనుమంత్ నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా నదిపై బ్రిడ్జి నిర్మించాలని వినతి

బెళుగుప్ప: మండల పరిధిలోని బూదిగమ్మ రామసాగరం వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే సుమారు 20 గ్రామాలు అభివృద్ధిలోకి వస్తాయని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం ఆల్‌ఇండియా ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ కార్యదర్శి వన్నూరస్వామి, బీజేపీ మండల అధ్యక్షుడు వన్నూరస్వామి, మనోహర్ తదితరులు తహసీల్దార్ ఓబులేసుకు వినతి పత్రం అందించారు. దశబ్దాలు గడుస్తున్నా పెన్నా నదిపై బ్రిడ్జి నిర్మించలేదన్నారు. దీంతో రాయదుర్గం, బెళుగుప్ప మండల వాసులు కళ్యాణదుర్గం మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోందన్నారు.

'దిశ' యాప్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ రామకృష్ణయ్య

బెళుగుప్ప: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణయ్య, ఏఎస్ఐలు దేవదాసు, రామదాసు పాల్గొన్నారు. పోక్సో చట్టం, దిశ యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పోలీసు అమరవీరుల దినోత్సవంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు.

ఘనంగా ఏకాదశి పూజలు



అలంకరణలో పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణి పాండురంగస్వామికి ఏకాదశి పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక జలంతో స్వామివారికి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అభిషేకం చేసి స్వామివారి మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ మహామంగళహారతి నిర్వహించారు. విఠల..విఠల రుక్మిణి పాండురంగ విఠల అంటూ భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించి నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గడ్డివాము దగ్ధం



బాధిత రైతును ఓదార్చుతున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: మండల పరిధిలోని వి.కొత్తకోట గ్రామంలో బుధవారం కురుబ వశికేరి అనే రైతుకు చెందిన గడ్డివాముకు నిప్పంటుకోవడంతో కాలిపోయింది. ఉరవకొండ అగ్నిమాపక సిబ్బంది హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కరణం పుష్పావతి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీటీసీ కాక తిమ్మరాజు, హనుమంతు యాదవ్, సంజప్ప, చిట్టిబాబు, సచివాలయ కన్వీనర్ సింగాడీ వీరప్పతో కలసి గడ్డివాము కాలిపోయిన ప్రదేశాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, అధికారుల దృష్టికి తీసికెళ్లి నష్టం పరిహారం అందేలా చూస్తామని బాధిత రైతుకు ధైర్యం చెప్పారు. దాదాపు రూ.రెండు లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.

అన్నదాతకు అండ

- రైతుల ప్రయోజనార్థం శీతల గిడ్డంగుల ఏర్పాటు



నేత్రపల్లి సమీపంలో నెలకొల్పిన శీతల గిడ్డంగి

గుమ్మఘట్ట: అన్నదాతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దీర్ఘదృష్టితో ఆలోచించి గ్రామాల్లో బహుళ ప్రయోజన గిడ్డంగులను నెలకొల్పారు. రైతులకు ఒకవైపు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తూనే.. మరోవైపు వారికి నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు, యంత్రాలను ఆర్బీకే కేంద్రాల ద్వారా అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే మరో అడుగు ముందుకేసి రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకుని ధరలు పెరిగిన తరువాత విక్రయించుకునేలా గోదాములను నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టారు.

ఒక్కోటి రూ.35 లక్షలతో..

నియోజకవర్గంలోని కలుగోడు పీఏసీఎస్ పరిధిలో 2, గొల్లపల్లి పీఏసీఎస్ పరిధిలో 2, డి.కొండాపురం పరిధిలో 4,గొడిశలపల్లి పీఏసీఎస్ పరిధిలో 2, మల్లికేతి పీఏసీఎస్ కింద 2,ఎన్.హనుమాపురం పీఏసీఎస్ కింద 2, 74 ఉడేగోళం పీఏసీఎస్ కింద 2 బహుళ ప్రయోజన గిడ్డంగులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే నేత్రపల్లి సమీపంలో గోదాము పూర్తి కాగా, మరో 9 గోదాముల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒక్కో భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ.35 లక్షలు ఖర్చు చేస్తోంది.

ప్రయోజనాలు ఇలా..

రైతులు పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరలు వచ్చేవరకు గోదాముల్లో నామమాత్రపు బాడుగ చెల్లిస్తూ భద్రంగా నిల్వ చేసుకోవచ్చు. వర్షానికి, ఎండకు, చీడపురుగుల బెడద తప్పించుకోవచ్చు. ధాన్యాన్ని తరలించే క్రమంలో రైతులకు వ్యయ ప్రయాసాలు చాలా వరకు తగ్గుతాయి. సొసైటీలకు ఆదాయం పెరుగుతుంది.

సంక్షిప్త సమాచారం

సబ్సిడీపై గడ్డి జొన్న విత్తనాలు

కూడేరు: ప్రభుత్వం సబ్సిడీతో అందించే గడ్డి జొన్న విత్తనాలను పాడి పెంపకందారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారులు శ్రీనివాసులు, శ్వేత బుధవారం తెలిపారు. కేజీ గడ్డి జొన్న విత్తనాలను రూ.23 చొప్పున ఒక్కొక్కరికీ 20 కేజీల వరకూ ఇస్తామన్నారు. రైతులు ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

అన్నప్రసాదం పంపిణీ

వజ్రకరూరు: రాగులపాడు, తట్రకల్లు, గంజికుంట, వెంకటాంపల్లి తదితర గ్రామాల్లో బుధవారం జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుశేసు ఆధ్వర్యంలో ఐదో రోజు బుధవారం రైతులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో పొలాల్లో పనుల్లో నిమగ్నమైన అన్నదాతలను కలిశారు. రెండు వేలమంది రైతులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఫౌండేషన్ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

విడపనకల్లు: ఉండబండ వీరభద్రస్వామి హుండీ కానుకలను ఈనెల 27వ తేదీన లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి వచ్చే భక్తులు సాధారణ దుస్తులు ధరించి రావాలని కోరారు.

క్షేత్రస్థాయిలో పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న ఉరవకొండ రూరల్ కన్వీనర్ సుంకన్న

ఉరవకొండ: సీఎం జగన్ నేతృత్వంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలయ్యాయని పార్టీ ఉరవకొండ రూరల్ కన్వీనర్ మూస్టూరు సుంకన్న, పెన్నహోబిల ఆలయ మాజీ చైర్మన్ అశోక్ తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ రూరల్ నాయకులతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 1 నుంచి పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ పథకాలను వివరించాలన్నారు. ఐదు రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు చేసిన మంచిని చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాలతో పార్టీ నాయకులు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లత్తవరం సర్పంచ్ వంశీకృష్ణ, మండల యూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షుడు వెలిగొండ దేవ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లప్ప, సోషల్ మీడియా కో-కన్వీనర్ ఓబుళపతి, మండల కార్యదర్శి బూదగవి భీమేష్ పాల్గొన్నారు.

త్వరలో ఇళ్ల పట్టాల పంపిణీ



ఈద్గా సమీపంలోని లేఅవుట్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉరవకొండ: గత 15 ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా కోర్టు వివాదంలో ఉన్న 560 మంది లబ్ధిదారులకు ఇటీవలే ఊరట లభించింది. ఈనెల 30లోపు లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపి, ప్రభుత్వం ద్వారా పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే విశ్వ లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం బుధవారం ఈద్గా మైదానం వద్ద 8 ఎకరాల స్థలంలో రెండు జేసీబీలతో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. పనులు పూర్తి కాగానే పేదలకు స్థలాలు హద్దులు చూపించి, ఇళ్లు మంజూరు చేస్తామని ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, ఎంపీడీఓ అమృతరాజ్, వైస్ ఎంపీపీ నరసింహులు, ఉప సర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్, పార్టీ పట్టణ నాయకులు ఈడిగ ప్రసాద్, బూదగవి ధనుంజయ, ఈడీటీ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకుడు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్, ఫెర్రర్ విగ్రహావిష్కరణ



ప్రారంభానికి సిద్ధమైన అంబేడ్కర్, ఫాదర్ ఫెర్రర్ విగ్రహాలు

కళ్యాణదుర్గం: కంబదూరు మండలం అండేపల్లిలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ ఫెర్రర్ విగ్రహావిష్కరణ తలపెట్టినట్లు కంబదూరు జడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, స్థానిక సర్పంచు పద్మావతమ్మ, అండేపల్లి దళితులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజా సంఘాలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

3న ఎస్‌ఈఏఎస్ పరీక్ష



మాట్లాడుతున్న మండల విద్యాధికారి-2 సాయికృష్ణ

కూడేరు: పిల్లలో విద్యా సామర్థ్యాలను వెలికి తీసేందుకే కేంద్ర ప్రభుత్వం (ఎస్‌ఈఏఎస్) స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే అనే పరీక్షను నిర్వహిస్తోందని మండల విద్యాధికారులు చంద్రశేఖర్, సాయికృష్ణ తెలిపారు. బుధవారం కూడేరులోని ఎమ్మార్సీ సెంటర్‌లో సీస్ పరీక్షకు ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పరీక్ష నవంబర్ 3న 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తారన్నారు. జబ్లింగ్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పరీక్ష పకడ్బందీగా జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలు వెంకటరమణ, శివ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాన్ని జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: పట్టణ పరిధిలోని 21వ వార్డు పైతోటలో ఈ నెల 27,28 తేదీల్లో జరిగే వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాన్ని జయప్రదం చేయాలని వార్డు కౌన్సిలర్ పైతోట సంజీవప్ప కోరారు. 27వ తేదీ సాయంత్రం పైతోటలో కలశాలతో భారీ ఊరేగింపు ఉంటుందన్నారు. 28న గురువారం ఉదయం 10 గంటలకు గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఫైర్‌స్టేషన్ మారెమ్మ గుడికి వెళ్లే దారిలోని మున్సిపల్ మోడల్ అభ్యుదయ స్కూల్‌లో గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. 10వ సచివాలయం పరిధిలోని 26, 27 వార్డు ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి స్పెషలిస్టు వైద్యులు వస్తారని, టోకెన్లు అందుతున్న వారు హాజరై చికిత్సలు పొందాలన్నారు. ఉచితంగా మందులు, వివిధ పరీక్షలు, ఇంకా మెరుగైన వైద్యం అవసరమైతే ఆరోగ్యశ్రీకి సిఫార్సు చేయనున్నట్లు కౌన్సిలర్లు ఫకృద్దీన్, ఉబ్బాగజాల చెప్పారు.

470 మందికి వైద్య సేవలు



క్యాంపులో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

కణేకల్లు: కణేకల్లు–1 గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' హెల్త్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించిన హెల్త్ క్యాంపులో 470 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్‌నాయక్ తెలిపారు. డాక్టర్లు రమేష్ నాయక్, చంద్రమనోహర్, పావని వైద్య సేవలందించారు. కార్యక్రమంలో జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, కణేకల్లు సర్పంచు నిర్మల, వైస్ సర్పంచు పెద్దదేవర మాబుపీరా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, మండల జేసీఏ కన్వీనర్ హనుమంతరావు, ఎంపీటీసీ వన్నూరుసా, ఈఓఆర్‌డీ గూడెన్న, ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.